సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం : 21 : ఫిబ్రవరి : 2023



పోచంపల్లిలో పూణె విద్యార్థులు
పూణెలోని స్టేమ్ యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం భూదాన్‌పోచం పల్లిని సందర్శించారు.
- 8లో



చరమగీతం పాడాలి
రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు.
- 9లో

గరిష్టం/కనిష్టం 37°/17°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రి చలి అధికంగా ఉంటుంది.

బ్రహ్మోత్సవ శోభ



విద్యుత్ వెలుగుల్లో శోభాయమానంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

నేటి నుంచి యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఉదయం 10 గంటలకు ప్రారంభం
- ముస్తాబైన ప్రధానాలయం
- విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలతో అలంకరణ

యాదగిరిగుట్ట : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. స్తంభోద్భవుడిగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. స్వస్తీ శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పాడ్యమి రోజు మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మార్చి 3వ తేదీన ఫాల్గుణ శుద్ధ ఏకాదశి శుక్రవారం రోజున శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో ఆరేళ్ల పాటు బాలాలయంలో బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈసారి కొండపై శ్రీస్వామి సన్నిధిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఘాట్ రోడ్డు ఆలయ పరిసరాల్లో విద్యుత్ లైట్‌లు వేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోనూ శ్రీస్వామి, అమ్మవారి ఆర్చిలను ఏర్పాటు చేశారు.

విశ్వక్సేన ఆరాధనతో శ్రీకారం
బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలో శ్రీవిశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో ప్రధానాలయంలో మొదలుకానున్నాయి. మార్చి 3న ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం 27న, తిరు కల్యాణం 28న, దివ్య విమాన రథోత్సవం మార్చి1న నిర్వహించనున్నారు. 23వ తేదీ నుంచి అలంకార, వాహన సేవలకు ఆచార్యులు శ్రీకారం చుడతారు.

సాంస్కృతిక కార్యక్రమాలు
బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి రాత్రి 10గంటల వరకు కొండపైన, వీఐపీ పార్కింగ్ వద్ద ఆలయం ఆధ్వర్యంలో, సాయంత్రం 6నుంచి 9గంటల వరకు బ్రహ్మోత్సవ మండపం వద్ద వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వేదికలను సిద్ధం చేస్తున్నారు.

ప్రథమ ప్రాకార మండపంలో సేవల అలంకరణ
బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనవి అలంకార, వాహన సేవలు. ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఉన్న మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాఢ వీధుల్లో ఊరేగిస్తారు. తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసే వేదిక వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్టింపజేసి ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారు. అదే విధంగా అద్దాల మండపం ఎదుట యాగశాల ఏర్పాటు చేస్తున్నారు.



యాగశాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది



తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేస్తున్న వేంచేపు మండపం

భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగొద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి
- యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లపై సమీక్ష

సాక్షి,యాదాద్రి : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ రాజేశ్‌చంద్ర,అదనపు కలెక్టర్ శ్రీనిసవాస్‌రెడ్డి, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, ఇతర అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులు, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా కల్యాణం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదనంగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్, డీసీపీ ఇతర అధికారులు

అంతరాయం లేకుండా చూడాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ఆదేశించారు. మెడికల్ ఫస్ట్ ఎయిడ్ స్టాళ్లు ఏర్పాటు చేయాలని, 104, 108 వాహనాలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులను సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఏచిన్న ఇబ్బంది తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ చంద్రయ్య, డిప్యూటీ ఈఓ భాస్కర్, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో సమన్వయ కర్తలు వీరే..

సాక్షి, యాదాద్రి : హాథ్ సే హాథ్ జోడో అభియాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా జిల్లాకు చెందిన పలువురు నాయకులకు అవకాశం లభించింది. భువనగిరికి చెందిన పోత్నక్ ప్రమోద్‌కుమార్ మలక్‌పేట, గజ్వేల్‌కు,మునుగోడుకు చెందిన చిలుముల కృష్ణారెడ్డి చాంద్రాయణగుట్ట, బహుద్దూర్‌పురకు నియమితులయ్యారు. అదే విధంగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన బీర్ల అయిలయ్య కల్వకుర్తి, షాద్‌నగర్‌కు, తుంగతుర్తికి చెందిన అద్దంకి దయాకర్ నర్సంపేట, ములుగు అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లుగా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియమితులైన వారు జోడో యాత్రను విజయవంతం చేయడానికి ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేయాలి. అంతేకాకుండా అక్కడ పార్టీ పరిస్థితిపైనా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.



బీబీనగర్‌లో అఖండజ్యోతి యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

భువనగిరికి చేరిన అఖండ జ్యోతి

- పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికిన ప్రజలు

సాక్షి, యాదాద్రి, బీబీనగర్: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో చేపట్టిన 29వ అఖండజ్యోతి రథయాత్ర సోమవారం రాత్రి భువనగిరి చేరుకుంది. అఖండజ్యోతికి కొండమడుగు, బీబీనగర్, భువనగిరిలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. రథయాత్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి పూజలు చేశారు. బాంబినో వర్మిసెల్లి పెడ్ కంపెనీ ఆధ్వర్యంలో అన్నదానం, ప్రసాదాల పంపిణీ చేశారు. అఖండ జ్యోతి నేడు యాదగిరిగుట్టకు చేరుకోనుంది. ఈ కార్యక్రమాల్లో ఎంపల్ల బుచ్చిరెడ్డి, టీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, యాత్ర ఆర్గనైజర్ ఆబోతుల గండేశ్వర్‌రావు, గడ్డం జ్ఞానప్రకాశ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఫక్కీర్‌కొండల్‌రెడ్డి, రోట రీక్లబ్ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటిక్యాల లావణ్య, వివిధ వర్గాల ప్రతినిధులు ఇరుకుల రామకృష్ణ, కరిపే నర్సింగరావు, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, శెట్టిబాలయ్యయాదవ్, దిడ్డిబాలా జీ, చెన్న లక్ష్మణ్, నాగభూషణం, దొంత లక్ష్మణ్, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, రథయాత్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో పూజలు నిర్వహిస్తున్న సద్ది వెంకట్‌రెడ్డి, తదితరులు

లాంగ్వేజ్ పండిట్‌లకు భరోసా!

- 9,10 తరగతులకు బోధన ప్రారంభం
- జిల్లాలో 122 మంది భాషా పండిట్‌లు

భువనగిరి : 19 రోజుల తర్వాత భాషా పండితులు 9,10 తరగతుల విద్యార్థులకు బోధన చేయడం ప్రారంభించారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా తమకూ పదోన్నతి కల్పించాలని కోరుతూ ఈ నెల 1నుంచి జిల్లాలోని 122మంది భాషా పండిట్‌లు బోధన చేయడం నిలిపివేశారు. విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఇచ్చిన హామీ మేరకు తిరిగి సోమవారం నుంచి బోధన చేయడం ప్రారంభించారు.

పరీక్షలు సరిగా రాసేనా?
జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పండిట్‌లు 143, భాషా పండిట్‌లు 122 మంది ఉన్నారు. భాషా పండిట్‌లు స్కూల్ అసిస్టెంట్ పండిట్‌లు లేని స్కూళ్లలో 9,10 తరగతులకు బోధన చేస్తున్నారు. ఈ నెల 1నుంచి భాషా పండిట్‌లు బోధన నిలిపివేశారు. దీంతో తెలుగు, హిందీ, ఉర్దూ సబ్జెక్టులను పట్టించుకునే వారు లేకపోయారు. ఈ నెల 22 నుంచి జరిగే ప్రీ ఫైనల్ పరీక్షలు ఎలా రాయేలో తెలియని పరిస్థితిలో పదో తరగతి విద్యార్థులు ఉన్నారు.

తరగతులకు హాజరవుతున్నాం



భాషా పండిట్‌లకు పదోన్నతులపై మంత్రి సానుకూలత వ్యక్తం చేస్తూ హామీ ఇవ్వడంతో 9,10 తరగతులకు బోధన ప్రారంభించాం. పదోన్నతులపై జూన్ 12వరకు గడువు పెట్టాం. అప్పటి వరకు పదోన్నతులు కల్పించకపోతే మళ్లీ బోధన నిలిపివేస్తాం.
–ఉపేందర్, రాష్ట్రీయ పండిట్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

‘టీచ్ ఫర్ చేంజ్’ అమలుకు గుర్తింపు

- కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు సన్మానం

సాక్షి, యాదాద్రి : జిల్లాలో టీచ్‌ఫర్ చేంజ్ కార్యక్రమం అమలు చేయడానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ చేసిన కృషికి ఆ సంస్థ నుంచి గుర్తింపు దక్కింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన టీచర్ ఫర్ చేంజ్ వార్షికోత్సవ సభలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వారిని సన్మానించారు. టీచ్ ఫర్ చేంజ్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి యాదాద్రి భువనగిరి జిల్లాలో టీచ్‌ఫర్ చేంజ్ కార్యక్రమం కింద 56 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను దత్తత తీసుకున్నారు. 27 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసి 3,4,5 తరగతుల విద్యార్థులకు రీడింగ్, రైటింగ్ నేర్పిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు గాను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు గౌరవం దక్కింది.ఈ కార్యక్రమంలో టీచ్ ఫర్ చేంజ్ సీఈఓ చైతన్య నర్సింహ, నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ కుష్బూగుప్తా, సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీని సన్మానిస్తున్న డీకే అరుణ

అవిశ్వాసంపై.. తగ్గేదేలే!

పట్టువీడని అసమ్మతి కౌన్సిలర్లు
- మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఒక్కటైన అధికార, విపక్షాలు
- అవిశ్వాసానికి అనుకూలంగా 17 మంది.. తటస్థంగా ఇద్దరు
- చైర్మన్ బుజ్జగించినా ససేమిరా అంటున్న సొంత పార్టీ సభ్యులు
- రసకందాయంలో చౌటుప్పల్ మున్సిపల్ రాజకీయం

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడింది. అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం వైపే మొగ్గు చూపుతున్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులంతా ఒక్కటై అవిశ్వాసం పెట్టాలని పట్టుబడుతున్నారు. అయితే చైర్మన్ సొంత పార్టీ సభ్యులను బుజ్జగించినా మెత్తబడడం లేదని తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండడంతో రాష్ట్ర స్థాయిలో చౌటుప్పల్ వ్యవహారం చర్చనీయాంశమైంది.

మొదటి నుంచి కయ్యాలే..
మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత మొదటి సమావేశం తర్వాత నుంచి కయ్యాలు మొదలయ్యాయి. బయటకు కలిసున్నట్టు కనిపించినా లోపల మాత్రమే చైర్మన్‌ది ఓ దారి అయితే కౌన్సిలర్లు మరోదారిగా వ్యవహరిస్తూ వస్తున్నారు. సమావేశాల్లో ప్రవేశపెట్టే తీర్మానాలను చైర్మన్ బలపరిస్తే కౌన్సిలర్లు వ్యతిరేకించడం, కౌన్సిలర్లు ప్రతిపాదిస్తే చైర్మన్ తిరస్కరించడం పరిపాటిగా మారాయి.



చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం

పార్టీల బలాలు

బీఆర్‌ఎస్	09
బీజేపీ	08
సీపీఎం	03

తాజా పరిస్థితి

అవిశ్వాసానికి అనుకూల కౌన్సిలర్లు	17
తీర్మానంపై సంతకాలు చేసినవారు	16
సంతకం చేయకున్నా అనుకూలం	01
తటస్థంగా ఉన్న సభ్యులు	02

అవిశ్వాసం అంశాన్ని పట్టించుకోని చైర్మన్
అన్ని పార్టీల కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్‌ను కలిసినా చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సీరియస్‌గా తీసుకోవడంలేదన్న ప్రచారం జరుగుతోంది. సమస్య త్వరలోనే సమసి పోతుందని, పార్టీ నాయకత్వం చూసుకుంటుందన్న ధీమాతో ఆయన ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన కౌన్సిలర్లలో కొందరు తనతో టచ్‌లో ఉన్నారని చైర్మన్ చెబుతున్నారు.

అదే పట్టుదల
అవిశ్వాసంపై తీర్మానం చేసిన కౌన్సిలర్ల వైఖరిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. తమది ఆత్మగౌరవ పోరాటం అని, పదవి ముఖ్యం కాదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చైర్మన్‌ను పదవి నుంచి దింపడమే లక్ష్యమని పేర్కొంటున్నారు. కౌన్సిల్‌లో 20మంది సభ్యులుండగా చైర్మన్‌ను మినహాయిస్తే 17మంది అవిశ్వాసానికి మద్దతుగా ఉన్నారు. ఇద్దరు తటస్థంగా ఉన్నారు. తటస్థులు కూడా తమతో వస్తారని అసమ్మతి కౌన్సిలర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్‌తో ఎవ్వరూ టచ్‌లో లేరని, ఆయన మాటలన్నీ అవాస్తవమని కొట్టిపారేస్తున్నారు. వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి, ఖర్చు చేసిన నిధులపై చైర్మన్ చెప్పిన లెక్కలు అవాస్తవమని అంటున్నారు.

జోక్యం చేసుకోని బీఆర్‌ఎస్ నాయకత్వం
చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం వ్యవహారాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం చూసుకుంటుందని చైర్మన్ ప్రకటించారు. కానీ, పార్టీ నాయకత్వం ఇప్పటి వరకు ఏం మాట్లాడలేదు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు సొంత పార్టీ కౌన్సిలర్లను నియంత్రించే చర్యలు చేపట్టకపోవడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా చర్చ
చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న వెన్‌రెడ్డి రాజు మున్సిపల్ చైర్మన్ల చాంబర్ అసోసియేషన్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రావడం, అందులోనూ సొంత పార్టీ కౌన్సిలర్లు సైతం తిరుగుబాటు చేయడంతో ఈ వ్యవహారంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అవిశ్వాసం అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు నడిపించాల్సి ఉన్నప్పటికీ అధికార పార్టీ కౌన్సిలర్లే ప్రధాన పాత్ర పోషిస్తుండడం గమనార్హం.

అభివృద్ధి కుంటుపడింది


చౌటుప్పల్ : మూడేళ్ల కాలంలో మున్సిపాలిటీ ఎలాంటి పురోగతి సాధించలేదని, అభివృద్ధి కుంటుపడిందని మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ వ్యక్తి చైర్మన్‌గా ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని విశ్వసించి బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చామన్నారు. అభివృద్ధి విషయంలో చైర్మన్‌ను నమ్మికొని విఫలమైనందున ప్రజలకు క్షమాపణలు చెబుతున్నామన్నారు. చైర్మన్ కేవలం టేబుల్ ఎజెండాకే ప్రాధాన్యం ఇస్తూ కౌన్సిల్ తీర్మానాలను పక్కనపెట్టారని ధ్వజమెత్తారు. ఆల్ఫా ఏజెన్సీ ద్వారా నియమితులైన 34 మంది పారిశుద్ధ్య కార్మికుల వద్ద పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. మెయింటెనెన్స్ కింద సుమారు రూ.లక్షన్నర వరకు చైర్మన్ అలవెన్స్‌గా తీసుకుంటున్నారని, ఈ విషయాలు ఇటీవల కౌన్సిలర్ల దృష్టికి వచ్చిందని తెలి పారు. చైర్మన్‌పై అవిశ్వాసానికి సీపీఎం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ శ్రీశైలంగౌడ్

లబ్ధి చేకూరే పనులకు చైర్మన్ ప్రాధాన్యం

చౌటుప్పల్ : తనకు లబ్ధి చేకూరే పనులకు మున్సిపల్ చైర్మన్ రాజు ప్రాధాన్యం ఇస్తున్నారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు ఆరోపించారు.మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.16.58 కోట్లతో అభివృద్ధి చేశాననడం అవాస్తవమన్నారు. ఏ వార్డులోనైనా రూ.30లక్షలకు మించి అభివృద్ధి జరగలేదన్నారు. టేబుల్ ఎజెండా పేరుతో దొంగ తీర్మానాలు చేసి నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు.హరితహారానికి ఓ పరిశ్రమ సీఎస్సార్ నిధులు కేటాయిస్తుందని, మున్సిపాలిటీ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. 8వవార్డు కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్ మాట్లాడుతూ అధికారుల మెప్పుకోసం చేసిన పనులు అభివృద్ధి ఎలా అవుతుందన్నారు. 18వ వార్డు కౌన్సిలర్ కె.శైలజ మాట్లాడుతూ తన వార్డులో రూ.1.40 కోట్లు ఖర్చు చేశామని ప్రకటించడం తగదని, రూ.15లక్షలకు మించి ఖర్చు చేయలేదన్నారు. పైలాన్‌పార్కుకు కేటాయించిన నిధులు వివరాలు చెప్పడం లేదన్నారు.7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల మాట్లాడుతూ కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కోరారు. తన వార్డులో సొంతంగా రూ.10లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. 14వ వార్డు కౌన్సిలర్ విజయ మాట్లాడుతూ తన వార్డులో రూ.20లక్షలకు మించి అభివృద్ధి జరగలేదని, రూ.85 లక్షల పనులు చేపట్టినట్లు చైర్మన్ చెప్పడం సరికాదన్నారు. తన సొంతంగా రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. 4వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో చైర్మన్ చెప్పిన లెక్కలన్నీ తప్పన్నారు.



మాట్లాడుతున్న పోలోజు శ్రీధర్‌బాబు, కౌన్సిలర్లు

న్యూస్‌రీల్

యాదాద్రిలో విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో, అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిత్య పూజలు విశేషంగా చేపట్టారు. శివాలయంలో మహాశివుడికి అభిషేకం, అర్చనలు, గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. ఇక యాదాద్రీశుడికి సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని 6వ నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద సోమవారం సందర్శించారు. కంటి పరీక్షలను పరిశీలించారు. అర్హులంతా కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమారాణి, లక్ష్మణ్‌బాబు, నవీన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఉపేందర్‌రెడ్డి

భువనగిరి : ఉపాధిహామీ కూలీలు ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఉన్నత ప్రాజెక్టులో భాగంగా వర్మీ కంపోస్టు ఎరువు, నర్సరీ పెంపకం పై నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్మికంపోస్టు ఎరువు తయారీ, నర్సరీల పెంపకం ద్వారా కూలీలు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ గుత్తా నరేందర్‌రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి శాస్త్రవేత్త నరేష్, డీపీఎం రాజు, ఏపీఓ పాల్గొన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

భువనగిరిటౌన్ : గొర్రెలు, మేకలకు మంగళవారం నుంచి 28వ తేదీ వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక అధికారి డాక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆరు లక్షల గొర్రెలు, మేకలకు మందు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం 50 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మార్చి 5న చేనేత ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఆనందప్రసాద్

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లో మార్చి 5వ తేదీన రాష్ట్ర స్థాయి చేనేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ తెలిపారు. సోమవారం భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలపై సమ్మేళనంలో చర్చించి తీర్మానాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామనిన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వేముల బాలరాజు, మాజీ ఎంపీపీ వనం శాంతికుమార్, భోగం లక్ష్మయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, వనం పరమేశ్, రాపోలు జ్ఞానేశ్వర్, గవ్వల శంకర్, పాశికంటి లక్ష్మీనర్సయ్య, రాపోలు జగన్, కర్నాటి పాండు, తడక వెంకటేశ్, తడక రమేశ్, సీత శ్రీరాములు, భారత లవకుమార్, చింతకింది రమేశ్, చిక్క కృష్ణ పాల్గొన్నారు

క్లుప్తంగా

భక్తులకు అనుగుణంగా బస్సులు

యాదగిరిగుట్ట : యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జంట నగరాల నుంచి యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. జంట నగరాల భక్తుల కోసం ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి నేరుగా యాదాద్రి రింగ్ రోడ్డులోని నూతన బస్టాండ్ వరకు బస్సులను భక్తులకు అనుగుణంగా ప్రతి 15 నిమిషాలకు ఒకటి నడిపిస్తామన్నారు. ఇక బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా శ్రీశైలం, వేములవాడ, కొమురవెల్లి ప్రాంతాల నుంచి బస్సులను నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 83 బస్సులు యాదగిరిగుట్ట డిపో పరిధిలో నడుస్తున్నాయని, వీలైనంత వరకు భక్తులకు ఇబ్బందులు లేకుండానే బస్సులను నడిపిస్తామన్నారు. ఇక రింగ్‌రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొండపైకి నిత్యం బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధాన ఘట్టాలైన ఎదుర్కోలు, తిరు కల్యాణం, రథోత్సవం రోజు ప్రతి 10 నిమిషాలకు ఒక్క బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. తీర్థ జనులకు ఆర్టీసీ పక్షాన మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

లక్ష్మీ సదన్‌లో అర్చకులకు బస సౌకర్యం

- దీక్షాపరుల మండపంలో కళాకారులకు భోజన వసతి ఏర్పాటు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే అర్చకులు, రుత్వికులు, పారాయణీకులకు తులసీ కాటేజీలోని లక్ష్మీ సదన్‌లో బస చేసేందుకు ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ సదన్‌లో ఉన్న గదులను 100 మంది బస చేసే విధంగా శుభ్రం చేశారు. 11 రోజుల పాటు ఈ లక్ష్మీ సదన్‌లోనే ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అర్చక స్వాములు, పారాయణీకులు, రుత్వికులు, యాజ్ఞీకులు ఉండనున్నారు. ఇక కళాకారులకు దీక్షాపరుల మండపంలో భోజన వసతి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఇందులో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీక్షాపరుల మండపంలో ఒక భాగం మిగిలి ఉండటంతో కళాకారులకు ఇందులోనే భోజన వసతి కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన పోలీస్ ఈవెంట్స్



షార్ట్‌పుట్ విసురుతున్న అభ్యర్థులు

నల్లగొండ క్రైం: పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లా మొత్తంగా 4,049 మంది హాజరుకాగా 1,252 మంది అర్హత సాధించారు. అధిక శాతం మంది అభ్యర్థులు రన్నింగ్‌లోనే అర్హత కోల్పోయారు. గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థులు రన్నింగ్, లాంగ్ జంప్‌లో సులభంగా అర్హత సాధించారు. చివరి రోజు 848 మందికి గాను 718 మంది పాల్గొనగా 206 మంది అర్హత సాధించారు. ఈవెంట్స్‌ను జిల్లా ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఈవెంట్స్ నిర్వహించామని ఎస్పీ తెలిపారు.

గుహల్లో కొలువై.. భక్తులకు నెలవై

- యాదవ మహర్షి తపస్సుతో యాదాద్రిపై కొలువుదీరిన నృసింహుడు

యాదగిరిగుట్ట: ఎక్కడైనా నరసింహుడు రాతి గుహల్లో.. అటవీ ప్రాంతాల్లో ఉండేందుకే ఇష్టపడతాడు. అందుకే ఆ స్వామిని 'మృగ నరహరి' అని కూడా పిలుస్తారు. అహోబిలంలో హిరణ్యకశిపుడిని వధించిన తర్వాత నృసింహుడు అడవుల్లో సంచరిస్తుండగా అయనను శాంతింపజేయాలని బ్రహ్మాది దేవతలు లక్ష్మీదేవిని వేడుకుంటారు. దీంతో అమ్మవారు చెంచులక్ష్మిగా యాదాద్రి ప్రాంతంలో అవతరించి నరహరిని శాంతింపజేసిందని పురాణాలు చెబుతున్నాయి. హిరణ్యకశిపుడిని చీల్చి చండాడిన నృసింహుడి చేతులు ఆదిమహాలక్ష్మిని మాత్రం అతి సున్నితంగా అక్కున చేర్చుకున్నాయి. అంతేకాకుండా యాదవ మహర్షి తపస్సుతో సింహరూపుడు పంచరూపాలతో సాక్షాత్కరించి స్వయంభుగా వెలిశారని ఈ యాదాద్రి క్షేత్రం చరిత్ర చెబుతోంది. రుష్యారాధన క్షేత్రంగానూ యాదాద్రి విరాజిల్లుతోంది. సృష్టి కర్త బ్రహ్మకే ఆయువు పోసిన బ్రహ్మాండనాయకుడు నృసింహుడని పురాణాలు ఘోషిస్తున్నాయి. నరసింహుడిని దర్శించుకున్న సృష్టికర్త బ్రహ్మ 'ఉగ్రం వీరం మహా విష్ణుం.. జ్వలంతం సర్వతో ముఖం.. నృసింహం భీషణం భద్రం.. మృత్యు మృత్యుం నమామ్యహం' అంటూ సృష్టి కార్యాన్ని ప్రారంభించాడని పండితులు చెబుతుంటారు.

పురాణాల పరంగా..

యాదాద్రికి సంబంధించి ఎన్నో ఇతిహాసాలు, రామాయణ మహాకావ్యంలోనూ ప్రస్తావన ఉన్నాయి. మహాజ్ఞాని విభాండకుడి కుమారుడు రుష్యశృంగుడు, అతడి పుత్రుడైన యాద మహర్షి తపోశక్తితోనే యాదగిరిగుట్ట వెలసిందంటారు. యాదుడు బాల్యం నుంచి మహావిష్ణు భక్తుడు. దేవదేవుడిని తిలకించాలన్న తపన నానాటికి పెరిగింది. అందులోనూ ఉగ్రరూపుడైన నృసింహావతారం పట్ల ఎనలేని మక్కువ కలిగింది. దైవసాక్షాత్కారం కోసం దట్టమైన అడవుల్లో తిరుగుతూ కొండజాతికి చిక్కాడు. ఆటవికులు యాదుడిని క్షుద్ర దేవతలకు బలి ఇవ్వబోతుండగా ఆంజనేయుడు ప్రత్యక్షమై

- నాడు భక్తోత్సవాలు.. నేడు బ్రహ్మోత్సవాలు



పూర్వం భక్తోత్సవాలు నిర్వహిస్తున్న ఆచార్యులు (ఫైల్)



పూర్వం యాదాద్రి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతంత్య్రం ముందు స్థానికులు మూడురోజులు భక్తోత్సవాలు నిర్వహించేవారు. స్వాతంత్య్రం అనంతరం 1955లో తొలిసారి 11రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో యాదాద్రి కొండ పైకి మెట్ల దారి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయినప్పటికీ ఈ ప్రాంతవాసులు ఎలాగో అలా కొండెక్కి మూడు రోజుల పాటు భక్తోత్సవాలు నిర్వహించేవారు. అప్పట్లో భక్తులు నిర్వహించేవారు కాబట్టి.. వాటిని భక్తోత్సవాలనేవారు. కొన్నేళ్ల తర్వాత ఈ భక్తోత్సవాలను ఐదు రోజులకు పెంచారు. మార్గశిర మాసంలో ఆ సంబురాలు జరిగేవి. అయితే మార్గశిర మాసంలో స్వామి వారి ఉత్సవాలు జరపడం సబబుకాదంటూ అప్పట్లోనే పూజారులు కొందరు ఫాల్గుణ మాసంలో 11 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాడ్డాక అప్పటి ఆలయ కమిటీ పెద్దలు ఆచార్యులతో సంప్రదించి 1955లో 11 రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

నట్లు పురాణాలు చెబుతున్నాయి. కీకారణ్యంలో సింహాకార గుట్టలు ఉన్నాయని, అక్కడికి వెళ్లి తపస్సు చేస్తే స్వామి సాక్షాత్కరిస్తాడని యాదుడికి ఆంజనేయుడు సూచిస్తాడు. యాదుడి దీర్ఘకాలిక తపస్సుతో స్తంభోద్భవుడు తొలుత జ్వాలా, గంధబేరుండ, యోగానంద, ఉగ్రసింహ, శ్రీలక్ష్మీ సమేతుడిగా (పంచరూపాలతో) యాదాద్రి గుహలోనే కొలువై ఉండడంతో ఈ క్షేత్రం పంచనారసింహ నిలయంగా పురాణాలకెక్కింది. యాద రుషి కోరిక ఫలితంగా వెలసిన క్షేత్రం యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందింది.

రక్షణగా సుదర్శన చక్రం..

తపోముద్రలో ఉన్న యాద మహర్షిని మింగేయాలని ప్రయత్నించిన ఒక రాక్షసుడిని మరుక్షణమే విష్ణుమూర్తి సుదర్శన చక్రం అడ్డుకుని వధించిందని, అప్పగి నుంచి గుట్ట చుట్టూ సుదర్శన చక్రం రక్షా కవచంగా నిలిచి ఉంటుందని భక్తుల అపార విశ్వాసం. స్వామి పుష్కరిణి సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచే పుట్టిందంటారు. ఈ పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే శారీరక రుగ్మతలు, గ్రహబాధల నుంచి విముక్తి కలుగుతుందని అంటుంటారు. ఎంతో కాలం మరుగున పడిపోయిన ఈ క్షేత్ర మహాత్యాన్ని స్థానిక గ్రామాధికారి కలలో స్వామి కనిపించి తన అవతార రహస్యాన్ని చెప్పాడని పురాణాల్లో ఉంది. హైదరాబాద్ వాస్తవ్యులు రాజామోతీలాల్ 1920లో ఆలయాన్ని నిర్మించి పూజాది కార్యక్రమాలు పునరుద్ధరించారని చరిత్ర చెబుతోంది. ఆయన హయాంలోనే పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానంతో పూజలు మొదలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడి మృతి

- టీవీఎస్ ఎక్సెల్‌పై రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టిన లారీ



చిన్నబాలు (ఫైల్)



గోపిచంద్ (ఫైల్)

కోదాడరూరల్: పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న తాత, మనవడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడి తండా వద్ద సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలం రామాంజనేయతండాకు చెందిన లకావత్ చిన్న బాలు(48) అతని అన్న మనవడు లకావత్ గోపిచంద్ (14)లు ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్‌పై వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో కూచిపూడితండా స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా రామాపురం క్రాస్‌రోడ్ వైపు వస్తున్న సిమెంట్ లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కకు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నబాలు అక్కడికక్కడే మృతిచెందగా గోపిచంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా బాలుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోపిచంద్ కూచిపూడిలో 8వ తరగతి చదువుతుండగా అతని సోదరుడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బాలు భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రామాపురం ప్రధాన రహదారిపై మృతుల బంధువులు, తండావాసులు ధర్నాకు దిగారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే రెండు ప్రాణాలు పోయాయని ఆరోపించారు. న్యాయం చేసేంత వరకు ధర్నా విరమించేదిలేదని రోడ్డుపైనే కూర్చున్నారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

చిట్యాల: మనస్పర్ధలతో తల్లిగారింటి వద్ద ఉంటున్న భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని వెంబావి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంబావి గ్రామానికి చెందిన ఈసం శేషమ్మ, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె రాములమ్మ అలియాస్ సరితను ఆరేళ్ల క్రితం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన అద్దంకి సైదులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో సరిత నెల రోజుల క్రితం తల్లిగారింటికి వచ్చింది. కాగా సోమవారం మధ్యాహ్నం సైదులు తన అత్త గారి ఇంటికి చేరుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న సరితతో గొడవ పడ్డాడు. అనంతరం ఆమెపై కత్తితో దాడి చేసి చేతులు, కాళ్లతో పాటు పలు చోట్లు గాయపరిచాడు. దీంతో ఆమె కేకలు వేయగా, చుట్టుపక్కల వాళ్లు రావటంతో సైదులు అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సరితను చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరిటౌన్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించబడిన ప్రజావాణి కార్యక్రమంలో 24 ఫిర్యాదులను ఆమె ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో అడినషల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ ఎం. నాగేశ్వరాచారి, ఇతర అధికా రులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన వినతులు..

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల రాజు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. చౌటప్పుల్ మున్సిపాలిటీలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో యోగా కేంద్రం నిర్వహించేందుకు స్థలం ఇవ్వాలని కోరుతూ యోగా సెంటర్ నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. చౌటుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 171లో తమ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బాధితులు వినతి పత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి తీసుకున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

కేంద్ర పథకాలకు మోకాలడ్డుతున్న కేసీఆర్

రామన్నపేట: కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలు రాష్ట్రంలోని పేదలకు అందకుండా సీఎం కేసీఆర్ మోకాలడ్డుతున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్ ఆరోపించారు. సోమవారం రామన్నపేటలో జరిగిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కార్ 350కిపైగా పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయకుండా మూడేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందని అన్నారు. ఫసల్ బీమా పథకంపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటిపాముల శివక్రిష్ణగౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, కార్యదర్శి గర్దాసు సురేష్, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, కోకన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావు, శేపూరి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.



రామన్నపేటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

యాదాద్రి ఆలయ జూనియర్ అసిస్టెంట్ మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేముల చంద్రయ్య(55) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆయన మరణించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చంద్రయ్య మృతి పట్ల ఆలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

పోచంపల్లిని సందర్శించిన పూణె విద్యార్థులు



పోచంపల్లిలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి సోమవారం మహారాష్ట్రలోని పూణెలోని స్లేమ్ యూనివర్సిటీకి చెందిన 13 మంది విద్యార్థులు పోచంపల్లిని సందర్శించారు. చేనేత గృహాలకు వెళ్లి చేనేత వస్త్రాల తయారీ విధానాలను తెలుసుకొన్నారు. మగ్గం నేయడం ద్వారా ఎంత ఆదాయం వస్తుంది, వస్త్రాలను ఎక్కడ మార్కెటింగ్ చేస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చేనేత సహకార సంఘాన్ని సందర్శించి అక్కడ ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు రాజ్‌సీనా, ఫారుఖ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో కమ్యూనికేషన్స్ అండ్ ఫైనాన్స్ కోర్సును చదువుతున్న సెకండర్ ఇయర్ విద్యార్థులు 'డిస్కవరీ ఇండియా' అనే కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి సందర్శనకు వచ్చారని పేర్కొన్నారు. ఇండియాలోని వివిధ ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, సంస్కృతిని అధ్యయనం చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే అంతర్జాతీయంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, ఇక్కడి చేనేత కళాకారుల జీవన స్థితిగతులను తెలుసుకోవడానికి వచ్చామని తెలిపారు. అధ్యయనం చేసిన అంశాలపై డాక్యుమెంటరీని కూడా రూపొందిస్తామని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

మునగాల(కోదాడ): హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మునగాల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(50) ట్రాక్టర్ డ్రైవర్. ఇదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవ కూడా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సంజీవ సొంత బాబాయి భార్య రామాంజమ్మతో మదార్ సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయమై పలుమార్లు సంజీవ రామాంజమ్మతో పాటు మదార్‌ను మందలించినప్పటికీ వినలేదు. దీంతో మదార్‌ను అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ నెల 16న రాత్రి గ్రామంలోని చర్చి బజారు నుంచి వస్తున్న మదార్‌ను సంజీవ కర్రతో వెంబడించి సమీపంలోని పశువుల కొట్టంలో పట్టుకుని దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మదార్‌ను కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. హతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని సోమవారం గ్రామంలోనే అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మునగాల సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ లోకేష్ పాల్గొన్నారు.

కొండమడుగు పీహెచ్‌సీకి నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్

బీబీనగర్: యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) జాతీయ నాణ్యత ప్రమాణాల విభాగంలో నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించింది. కొండమడుగు పీహెచ్‌సీని గత డిసెంబర్ నెలలో జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు సందర్శించి ఆస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అదేవిధంగా పీహెచ్‌సీలోని రికార్డులు, రిజిస్టర్ల నమోదు, ల్యాబ్ సేవలను పరిశీలించారు. ఆస్పత్రి పట్ల అక్కడి రోగుల అభిప్రాయాలను బృందం సభ్యులు పరిగణలోకి తీసుకున్నారు. దీంతో నేషనల్ క్వాలి టీ అస్యూరెన్స్ స్టాండర్డ్‌లో 94.4శాతం మార్కులు సాధించడంతో పాటు నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించి యాదాద్రి జిల్లాలో ఉత్తమ పీహెచ్‌సీగా పేరు తెచ్చుకుంది. సర్టిఫికెట్‌ను సాధించిన ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం అభివృద్ధికి రూ.3లక్షల నగదు పారితోషికం అందనున్నట్లు సమాచారం. జిల్లాలోని మొత్తం 21పీహెచ్‌సీలో 9పీహెచ్‌సీలు 2021 నుంచి ఇప్పటి వరకు జాతీయ హెల్త్ మిషన్ సర్టిఫికెట్లను సాధించినట్లు సమాచారం. కొండమడుగు పీహెచ్‌సీ నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

ఉచిత విద్యుత్ ఘనత తెలంగాణదే



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు


- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకారానికి హాజరు




పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు

నల్లగొండ టౌన్ : దేశంలో వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడిగా నియమితులైన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యత స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2014 సంవత్సరానికి ముందు తెలంగాణలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిని ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కారం చూపారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటున్న ప్రధాని మోదీ తనసొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా రైతులకు ఇప్పటికే 7 గంటల విద్యుత్‌ను ఇవ్వడం లేదన్నారు. గుజరాత్‌లో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టిన ఘనుడు నరేంద్రమోదీ అని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల కేంద్ర మంత్రులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారి పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు తెలంగాణలో అమలవుతున్న పథకాలు కావాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానానికి చేరుకుందన్నారు. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలతో వ్యవసారంగం పండుగలా మారి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన కేసీఆర్‌కు రైతులు అండగా నిలవాలని కోరారు. రైతుబంధు సమితి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుబిడ్డగా రైతుల సంక్షేమానికి పాల్పడతానని పేర్కొన్నారు. తాను రైతుబంధు సమితి అధ్యక్షుడు కావడానికి కృషి చేసిన మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఎన్.భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, షీప్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, డీఏఓ వై.సుచరిత తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి నరసింహుడి క్షేత్రం నాడు.. నేడు



1960 సంవత్సరానికి ముందు యాదగిరిగుట్ట ప్రాంతం



2014కు ముందు యాదగిరి క్షేత్రం ఇలా..



ఆలయం అభివృద్ధి చేసిన తరువాత ప్రస్తుతం 2023లో ఇలా..

యాదగిరిగుట్ట : యాదవ మహర్షి ఘోర తపస్సుతో కొండ గుహల్లో వెలసిన పంచనారసింహుడి క్షేత్రం దినాదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు కీకారణ్యం గుట్టలో వెలసిన శ్రీస్వామికి భక్తులు నిత్యం పూజలు చేస్తుండేవారు. హైదరాబాద్‌కు చెందిన రాజామోతీలాల్ 1920లో శ్రీస్వామికి ఆగమ శాస్త్రం ప్రకారం పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి కోసం బాటలు వేసినట్లు చరిత్రకారులు చెబుతారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వాల హయాంలో ఇక్కడ అభివృద్ధికి తోడ్పాటునందించారని సమాచారం. అప్పటి నుంచి దినాదిన ప్రవర్ధమానంగా యాదగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు స్వామి దర్శనం ఇస్తున్నారు. ఇక 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో యాదాద్రిని అభివృద్ధి చేసి గతేడాది మార్చి 28న ప్రధానాలయాన్ని మహా కుంభ సంప్రోక్షణతో ఉద్ఘాటన చేపట్టి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు.

రెడ్ల ఆత్మీయ సభను జయప్రదం చేయాలి

- రెడ్డి జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి

నాగారం: రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆత్మకూర్(ఎస్) మండలంలోని నిమ్మికల్‌లో జరిగే రెడ్ల ఆత్మీయ సభను జయప్రదం చేయాలని రెడ్డి జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య పథకాన్ని పేద రెడ్ల కుటుంబాలకు అమలు చేయాలన్నారు. రైతులకు రైతుబీమా పథకాన్ని 60 ఏళ్ల నుంచి 75 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు సురుకంటి నర్సిరెడ్డి, నాయకులు గుంటకండ్ల ముకుందారెడ్డి, యారాల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.